

పట్టాలు తప్పిన పనులు..!

రైల్వే నిర్మాణ పనుల్లో నాణ్యత కరువైంది. అండర్ టన్నల్ వే వద్ద రాళ్లుతేలడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- 8లో



మాకొద్దు బాబోయ్..!

ఉపాధి వేతనదారులు ఫిష్‌పాండ్ పనులపై నిరాసక్తత చూపుతున్నారు. తక్కువ వేతనం వస్తోందంటూ పనులు నిలిపివేస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఐక్య పోరాటానికి మద్దతు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ఈ నెల 21 నుంచి చేపట్టనున్న ఐక్య పోరాటానికి ఏపీసీపీఎస్‌ఈఏ (ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్) సంఘం పూర్తి మద్దతు ఇస్తోందని సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వి.వి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలపై కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

అధికారులను టార్గెట్ చేయడం తగదు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని, ఈ విషయంలో ఓటర్లకు సమాధానం చెప్పలేని స్థితిలో పాలకులు ఉన్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ దుయ్యబట్టారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పథకాల అమలును గాలికొదిలేసి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట వైఎస్సార్ సీపీ నేతలతో పాటు సీనియర్ ఐఏఎస్, విశ్రాంత అధికారులను కూడా టార్గెట్ చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ఇప్పటికే వందలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను జైల్లలో పెట్టించారని మండిపడ్డారు. అధికారులను వ్యక్తిగత కక్షలతో అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఇదే విధానం కొనసాగితే ఏ ఒక్క ఐఏఎస్, ఐపీఎస్ అధికారి కూడా రాష్ట్రంలో పనిచేయడానికి ముందుకు రారని చెప్పారు. కూటమి ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో వారికి బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

15 మంది యాత్రికులకు డయేరియా



చికిత్స పొందుతున్న కర్ణాటక యాత్రికులు

టెక్కలి రూరల్: కర్ణాటక నుంచి బస్సులో తీర్థయాత్రకు వెళ్లి తిరిగి స్వస్థలాలకు వస్తున్న పలువురు యాత్రికులు డయారియా బారిన పడ్డారు. శనివారం ఉదయం 8 గంటల సమయంలో సుమారు 15 మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతూ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది ప్రథమ చికిత్స అందించి డయేరియా వార్డులో చేర్పించారు. మొత్తం 50 మంది అయోధ్య, కాశీ వంటి క్షేత్రాలను సందర్శించారు. తిరుగు ప్రయాణంలో ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసినప్పుడు ఫుడ్ పాయిజన్ కావడంతో అస్వస్థతకు గురయ్యారు. అక్కడ వైద్యపరీక్షలు చేయించుకుని కొందరు రైలులో తమ ప్రాంతానికి వెళ్లిపోయారు. మిగిలిన వారు బస్సులో బయలుదేరి వస్తుండగా టెక్కలి సమీపంలోకి వచ్చేసరికి 15 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ప్రత్యేక వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.

జిల్లాలో కొత్త అగ్నిమాపక కేంద్రాలు



అగ్నిమాపక పరికరాల పనితీరుని పరిశీలిస్తున్న ఆర్‌ఎఫ్‌ఓ నిరంజన్ రెడ్డి

టెక్కలి రూరల్ : ఇచ్ఛాపురం, సోంపేట, బొబ్బిలి, పాలకొండ తదితర ప్రాంతాల్లో నూతనంగా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు విశాఖపట్నం రీజనల్ అగ్నిమాపకాధికారి నిరంజన్ రెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా శనివారం టెక్కలి అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. పరికరాలు, వినియోగంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందిలో ఎక్కువ శాతం మంది హోంగార్డులే ఉన్నారని, వారికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా ఫైర్ ఇంజిన్లు కొనుగోలు చేయనున్నామని చెప్పారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన డాబా గార్డెన్



హృదయాకారంలో మొక్క



బోన్సాయి మొక్కలు



పిట్టగోడపై ఉన్న మొక్కల కుండీలు



డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు



పండ్లను కోస్తూ...

- జిల్లా కేంద్రంలో మేడపై తోట పెంచిన దంపతులు
- వివిధ రకాల మొక్కలతో కనువిందు

శ్రీకాకుళం కల్చరల్: డాబా గార్డెన్స్ అంటే విశాఖలోని ప్రాంతం అనుకునేరు. జిల్లా కేంద్రంలోనూ ఓ డాబా గార్డెన్ ఉంది. మేడపై తోటను అందంగా సాగు చేసుకుంటూ ఈ దంపతులు ఆశ్చర్యం కలిగిస్తున్నారు. నగరంలోని బలగ వద్ద గల సత్యసాయి నగర్‌లో నివాసం ఉంటున్న పంతులు శశిభూషణరావు, మంజుల వాణి దంపతులు తమ డాబాను మొక్కలతో నింపి గార్డెన్‌గా చేసుకున్నారు. మంజుల వాణి గత ఏడాది తన తోటలో కొత్తగా వచ్చిన డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను రెండు డబ్బాలలో వేశారు. ఈ నెలలో 12 డ్రాగన్ ఫ్రూట్స్ ఒకేసారి వచ్చాయి. ఇంకా 15 రెడీగా ఉన్నాయి. డ్రైఫ్రూట్స్ మొక్కలలో అంజీరా, స్టార్ ఫ్రూట్స్, గ్రీన్ బెర్రీ రకాలు సాగు చేస్తున్నారు.

20 రకాల మొక్కలు

మంజుల వాణి తన ఇంట్లో ఆదెనియం (బోన్సాయి) 10 రకాల పూల మొక్కలను ప్రత్యేకంగా బెంగళూరు నుంచి తెప్పించి పెంచుతున్నారు. ఇంకా జామ, మనీప్లాంట్, కాక్టస్ ప్లాంట్, జాస్మిన్ డ్రాగన్ ఫ్రూట్స్, షోయింగ్ ప్లాంట్స్, క్రోటన్ మొక్కలు పెంచుతున్నారు. ఇందులో బీరపాదు, బెండ, ఆనపపాదు, దొండపాదు, డ్రమ్ స్టిక్స్ రకాల కూరగాయల మొక్కలు కూడా ఉన్నాయి. పూల మొక్కలలో గులాబీ రకాలు, చామంతి, బంతి, మల్లె, కనకాంబరాలు ఉన్నాయి. వీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తుంటారు.


రోజులో 8 గంటలు మొక్కల సేవే



నేను నిత్యం మొక్కలతోనే ఉంటాను. రోజులో 8 గంటలు మొక్కల మధ్యే ఉంటాను. వాటికి సేవ చేయడం నాకు ఇష్టం. నా పనిలో నా భర్త కూడా సాయం చేస్తారు. మొక్కలను ప్రేమతో పెంచాలి అనేది నా అభిప్రాయం.

– మంజులవాణి, గార్డెనర్, బలగ

లోను లేనట్టేనా?



- ఈ ఏడాది బీసీ, ఈబీసీ రుణాలకు బ్రేక్
- నిధుల్లేక ఎక్కడికక్కడ ఆపేయమన్న ప్రభుత్వం
- తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు రుణాల జోలికెళ్లొద్దని మౌఖిక ఆదేశం
- వెనకబడిన వర్గాలకు మరోసారి నిరాశ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వెనకబడిన వర్గాలకు మరోసారి నిరాశ తప్పలేదు. బీసీ, ఈబీసీల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మరో ఏడాది తాత్సారం చేసే పరిస్థితి కనిపిస్తోంది. సబ్సిడీ కింద మంజూరు చేయాల్సిన నిధుల్లేక.. అవసరం మేరకు నిధులు విడుదల చేయలేక ఇప్పటివరకు జరిగిన ప్రక్రియను ఎక్కడికక్కడ ఆపేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు చర్యలు చేపట్టొద్దని సూచనప్రాయంగా చెప్పింది. ఇప్పటికే అరకొర యూనిట్ల కేటాయింపు, ఆపై నేతల జోక్యంతో తలలు పట్టుకుంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వం తాజా ఆదేశాలు ఇవ్వడంతో కొన్నాళ్లు ఒత్తిళ్లు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు.

మాటలే.. చేతల్లేవ్..

రాష్ట్రంలో అత్యంత వెనకబడిన జిల్లా.. 90 శాతం మేర వెనుకబడిన వర్గాలు ఉన్న ప్రాంతం శ్రీకాకుళం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ నిస్పృహతో కొట్టుమిట్టాడుతున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని.. ఆలోపు రూ.3వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని ఎన్నికల వేళ ప్రగల్బాలు పలికిన కూటమి నాయకులు పదవిలోకి వచ్చాక ఆ హామీని గాలికొదిలేశారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి పక్కన పెడితే విధిగా ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలనూ ఎగ్గొట్టేస్తున్నారు. ఈ క్రమంలోనే వెనకబడిన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలిస్తామని తొలుత హడావుడి చేశారు. దరఖాస్తులు ఆహ్వానించినప్పటికీ.. బ్యాంకు అధికారులు, ఇతర శాఖల అధికారులతో సంబంధం లేకుండా ఎమ్మెల్యేలే ఫైనల్ చేసే పరిస్థితి ఏర్పడింది.

భారీగా దరఖాస్తులు.. అరకొరగా యూనిట్లు..



జిల్లాలో ఎక్కువగా వెనకబడిన వర్గాల వారే ఉన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో అన్ని జిల్లాల కన్నా మనకే అధికంగా రుణ యూనిట్లు కేటాయించాలి. కానీ, ప్రభుత్వం కేవలం 3,144 యూనిట్లే కేటాయించింది. 50 శాతం సబ్సిడీతో ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి, ఈ యూనిట్లు ఎటూ సరిపోవు. కానీ, తక్కువ యూనిట్లు కారణంగా ప్రభుత్వం దరఖాస్తుల సమయంలోనే అనేక ఆంక్షలు పెట్టింది. చివరికి 22,822 మంది దరఖాస్తు చేసుకోగలిగారు. వారందరికీ ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. తుది ఎంపిక మాత్రం ఎమ్మెల్యేల చేతుల్లోకి వెళ్లిపోయింది.

అధికారులపై ఒత్తిళ్లు..



ప్రభుత్వం కేటాయించిన 3144 యూనిట్లకు గాను సబ్సిడీ కింద సుమారు రూ.60 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. కానీ, ఒక్క రూపాయీ విడుదల చేయలేదు. సబ్సిడీ నిధులు రాకపోవడంతో బ్యాంకులు ముందుకు రాలేదు. బీసీ కార్పొరేషన్ అధికారులు సైతం ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. ఈలోపు దరఖాస్తుదారుల నుంచి ఒత్తిళ్లు, నేతల నుంచి సిఫార్సుల తాకిడి పెరగడంతో ఉక్కిరిబిక్కిరియ్యారు. చివరికి ప్రభుత్వం సబ్సిడీ నిధులు ఇచ్చాక చూసుకుందామనే ఆలోచనకు వచ్చేశారు.

నిధుల్లేక రుణాలకు బ్రేక్..



తాజాగా రుణాల మంజూరు విషయంలో ముందుకెళ్లొద్దని ప్రభుత్వం బ్రేకులు వేసింది. ఎక్కడికక్కడ ఆపేయాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. సబ్సిడీ కింద నిధులు విడుదల చేసే పరిస్థితి లేకపోవడంతో పాటు అరకొర యూనిట్లతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది బీసీ, ఈబీసీలకు రుణాలు వస్తాయా? అన్న దానిపై సందేహాలు కమ్ముకున్నాయి.

హైవేపై హాహాకారాలు

- లారీని ఢీకొట్టిన టూరిస్ట్ బస్సు
- విశాఖకు చెందిన ఏడుగురు యాత్రికులకు గాయాలు
- అదే సమయంలో ప్రమాదానికి గురైన మరో లారీ
- క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ దుర్మరణం



క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీస్తున్న స్థానికులు



ప్రమాదంలో నుజ్జయిన బస్సు

శ్రీకాకుళం రూరల్:

జాతీయ రహదారిపై శనివారం వేకువజామున హాహాకారాలు మిన్నంటాయి. ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు, అటువైపుగా వెళ్తున్న వాహనచోదకులు భీతిల్లిపోయారు. తొలుత టూరిస్ట్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టగా.. కొద్దిసేపటి తర్వాత అదేచోట ఆగి ఉన్న లారీలను మరో గ్రానైట్ లారీ ఢీకొట్టింది. నిమిషాల వ్యవధిలో జరిగిన ఈ ఘటనల్లో ఓ డ్రైవర్ మృతి చెందగా, ఏడుగురు యాత్రికులు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని సింగుపురం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం సమీపంలో శనివారం వేకువజామున సుమారు ఐదు గంటల ప్రాంతంలో విశాఖపట్నం నుంచి బరంపురం వెళుతున్న కంభమేశ్వరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా.. ప్రమాదం ధాటికి ఏడుగురు ప్రయాణికులు బస్సులోనే గాయపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అప్రమత్తమై హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది బస్సులో నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. ఆ సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. ఇదే రహదారిలో వరుసగా నాలుగు లారీలు నిలిచిపోయాయి. ఆ సమయంలో విశాఖ వైపు నుంచి కోటబొమ్మాళికి గ్రానైట్ రాళ్లతో వస్తున్న లారీ.. ముందు ఆగి ఉన్న లారీలను గమనించక అతివేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో గ్రానైట్ రాళ్లు క్యాబిన్ వైపునకు దూసుకురావడంతో అందులో చిక్కుకుని లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని విశాఖ జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన రాపర్తి నూకరాజు(38)గా గుర్తించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమయంలో లారీలు ఒకదానితో ఒకటి కలిసిపోవడంతో అతి కష్టమ్మీద మృతుడిని బయటకు తీశారు. టౌన్ సీఐ పైడపునాయుడు, రూరల్ ఎస్సై రాము ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.



నుజ్జయిన గ్రానైట్ లారీ ముందు భాగం

ప్రాజెక్టుల పనుల్లో పురోగతి ఏదీ?



హిరమండలంలో విలేకరులతో మాట్లాడుతున్న రెడ్డి శాంతి, నాయకులు

- కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం

హిరమండలం: వంశధార ప్రాజెక్టుల విషయంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేయగా.. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజమెత్తారు. శనివారం హిరమండలంలో వంశధార ఫేజ్–2 రిజర్వాయర్‌తో పాటు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంశధార రిజర్వాయర్ నిర్మాణానికి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం నిర్వాసితులకు అన్యాయం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే అదనపు సాయం అందిందని గుర్తుచేశారు. దాదాపు 97 శాతం పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిచేసిందని.. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కావస్తున్నా మిగిలిన మూడు శాతం పనులు పూర్తిచేయకుండా తాత్సారం చేస్తోందని దుయ్యబట్టారు. వంశధార ఫేజ్–2 రిజర్వాయర్‌కు కీలకమైన ఎత్తిపోతల పథకంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. 2022 సెప్టెంబరు 14న అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికిగాను రూ.176.35 కోట్లు మంజూరు చేశారని, ఏడాది కాలంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 33 శాతం పనులు పూర్తిచేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో 7 శాతం పనులు మాత్రమే పూర్తిచేసిందన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నా రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, నాయకులు లోలుగు లక్ష్మణరావు, వి.చిన్నారావు, వి.చిరంజీవి, ఎం.రామారావు, ఎల్.ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, బి.మురళి, వి.బాలరాజు, ఎన్. ఆనందరావు, మామిడి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలను ముద్దల్లా పడేస్తారా?

- ఆందోళనకు దిగిన క్వారీ ఘటన బాధిత కుటుంబ సభ్యులు
- పోస్టుమార్టానికి తరలించకుండా నిరసన
- న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్, ఎస్పీ

మెళియాపుట్టి :

దబ్బగూడ కొండపై క్వారీ (మానీస్ కూనపు రెడ్డి)లో శుక్రవారం జరిగిన ఘటన పిడుగు పాటు కాదని, పేలుడు వల్లే తమవారు మృతి చెందారంటూ బాధిత కుటుంబసభ్యులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. సాయంత్రం మూడు గంటల వరకు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించడానికి నిరాకరించారు. తమకు న్యాయం చేయాల్సిందేనని పట్టుబట్టారు. మృతదేహాలను ఘటనా స్థలం నుంచి నిమిషాల వ్యవధిలో తరలించడం వెనుక కుట్ర ఉందనీ, కొన్ని శరీరభాగాలను కొండ మీదనే విడిచి పెట్టి, మిగతా శరీర భాగాలను కిందకు తీసుకురావడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతులు అప్పన్న, రాము, ఆర్ముగంల భార్యాపిల్లలు, ఇతర కుటుంబసభ్యులు శనివారం క్వారీ వద్ద ఆందోళనకు దిగారు.

ఈ సందర్భంగా రాము కుమారుడు షణ్ముఖరావు మాట్లాడుతూ మృతదేహాలను బొలెరో వాహనంలో ముద్దగా పడేశారని, ఇటువంటి దుశ్చర్యకు పాల్పడటం తగదన్నారు. ఆర్ముగం భార్య జయంతి మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయామని, ఎలా బతకాలంటూ విలపించారు. కనీసం మానవతా దృక్పథం లేకుండా మృతదేహాలను బొలెరోలో పడేశారనీ, తమకు తెలియకుండా గొయ్యితీసి పాతేసే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. పిడుగుపాటుతో బ్లాస్టింగ్ జరిగినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నామని, ఘటనా స్థలంలో మృతదేహాలు ఉంచకుండా తరలించడం సరైన చర్యకాదని, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పూర్తి వివరాలు సేకరించి క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. సాయంపై మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడతానని చెప్పారు. న్యాయం చేసేందుకు పూర్తి బాధ్యత తనదేనని కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పాతపట్నం సీఐ రామారావు తెలిపారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, మైన్స్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన దీర్ఘాసి ఈశ్వరరావు (50) సైకిల్ మీద వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న స్కూటర్ ఈనెల 7వ తేదీన ఢీకొంది. దీంతో గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈశ్వరరావు శనివారం మృతి చెందారు. ఆస్పత్రి వర్గాలు నివేదిక ఆధారంగా ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో జవాన్ మృతి


మోహనరావు (ఫైల్)

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని ఆరో వార్డు టి.మన్నయ్యపేటకు చెందిన గొద్దు మోహనరావు (46) అనే బీఎస్‌ఎఫ్ జవాన్ గుండెపోటుతో మరణించాడు. న్యూఢిల్లీలోని బీఎస్‌ఎఫ్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుండగా, శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురయ్యారు. వెంటనే తోటి సైనికులు మోహనరావును సమీపంలోని ఆస్పత్రికు తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహం ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు, అక్కడ నుంచి స్వగ్రామానికి చేరుకోనుంది. మోహనరావుకు భార్య సంధ్య, కుమార్తె జాస్మిని, కుమారుడు శశాంక్ ఉన్నారు. జవాన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పశువుల వాహనం స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని ఎచ్చెర్ల పోలీసులు శుక్రవారం రాత్రి చిలకపాలేం సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకున్నారు. 25 పశువులు అక్రమంగా తరలిస్తుండడంతో వాహనం సీజ్ చేశారు. పశువులు అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. పశువులను సంరక్షణ కోసం విజయనగరం గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు


ఆన్‌లైన్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్న ఏపీఈఏపీ సెట్–2025 (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)కు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు. సెలవు రోజుల్లో మినహా ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా 19, 20 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్ పరీక్ష నిర్వహిస్తారు. 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు చేపడతారు. జిల్లాలో నాలుగు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో షిఫ్టులో పరీక్షలు నిర్వహిస్తారు. అధికారులు ఈ మేరకు నాలుగు పరీక్ష కేంద్రాలు ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ, చిలకపాలేంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ, టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కాలేజీ, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్‌లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నుంచి ఎంపీసీ, బైపీసీ స్ట్రీముల్లో 18,000 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలకు నిమిషం నిబంధన అమలు చేస్తారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు నుంచే అనుమతిస్తారు.

గడ్డి మందు తాగి యువతి ఆత్మహత్య

కాశీబుగ్గ: పలాస మండలంలోని లొత్తూరు పంచాయతీ తొసరాడ గ్రామానికి చెందిన సవర వసంతి (22) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి వద్ద వసంతి ఖాళీగా ఉండడంతో తల్లి సవర మహాలక్ష్మి ఏదైనా పనిచేసుకోవాలని సూచించారు. దీంతో కోపంతో శుక్రవారం గడ్డిమందు తాగింది. దీంతో హుటాహుటిన పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు తప్పిన పనులు..!




అండర్ టన్నల్ రహదారిపై రాళ్లు తేలిన దృశ్యం

- రైల్వే నిర్మాణ పనుల్లో నాణ్యత డొల్ల
- అండర్ టన్నల్ వే పనుల పర్యవేక్షణ కరువు
- నెలలు గడవక ముందే రాళ్లుతేలిన వైనం
- వాహనదారులకు తప్పని తిప్పలు

ఆమదాలవలస రూరల్:

రైల్వేశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. ఎక్కడ చూసినా పనుల్లో డొల్లతనం కళ్లకు అద్దినట్లు కనిపిస్తోంది. అయినా రైల్వేశాఖ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తనట్లు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆమదాలవలస మండలంలోని కనుగులవలస, పొందూరు మండలంలోని పెనుబర్తి వద్ద జరిగిన అండర్ టన్నల్ వే నిర్మాణ పనులు అధ్వానంగా ఉన్నాయి. రైల్వేగేట్లు మూసివేసే ప్రాంతంలో రైల్వేశాఖ ఈ అండర్ టన్నల్ వే నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. రైల్వేట్రాక్ కింద చేసిన నిర్మాణ పనులతో పాటు ఇరువైపులా చేపట్టిన నిర్మాణ పనులు కోసం ఒక్కో అండర్ టన్నల్ వేకు సంబంధించి సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు రైల్వేశాఖ ఖర్చు చేసింది. అయితే నాణ్యతకు సంబంధించి అధికారులు పర్యవేక్షణ కరువవ్వడంతో పనులు పట్టాలు తప్పాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్‌లో తప్పని ముప్పు

రైల్వేగేట్లు బదులుగా ట్రాక్ కింద నుంచి పలు భారీ వాహనాలతో పాటు అనేక వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఈ అండర్ టన్నల్ వే పనులు రైల్వేశాఖ చేపట్టింది. రైల్వేశాఖకు సంబంధించి అండర్ టన్నల్ వే పైనున్న ట్రాక్ నుంచి నిత్యం అనేక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అత్యంత భారమైన రైళ్లు రాకపోకలు సాగిస్తున్నందున రైల్వేశాఖ ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టినా నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉంది. లేకుంటే రైలు ప్రమాదాలకు అవకాశాలు ఉంటాయని చెప్పడానికి ఇటీవల కాలంలో జరుగుతున్న రైలు ప్రమాదాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.


కనుగులవలస వద్ద బీటలువారిన పిల్లర్ పనులు

వాహనదారులకు ఇబ్బందులు

అండర్ టన్నల్ వే పనులు పూర్తిచేసి మూడు నెలలు గడవకముందే రాళ్లు తేలుతుండడంతో నిత్యం ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టన్నల్ వే వద్ద రహదారిపై రాళ్లు తేలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక ద్విచక్ర వాహనాలు బోల్తాపడి పలువురు గాయాలబారిన ఇటీవల పడ్డారు. దీంతో అధికారులు ఇప్పటికైనా స్పందించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



అండర్ టన్నల్ వే పనుల్లో నాణ్యతా లోపాలు కళ్లకు అద్దినట్లు కనిపిస్తున్నాయి. రైల్వేశాఖ అధికారులు పర్యవేక్షణ చేసి సంబంధిత గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

– సూర శ్యామ్‌కుమార్, కనుగులవలస గ్రామం

ఇబ్బందులను తొలగించాలి



అండర్ టన్నల్ వే నిర్మాణ పనులు పూర్తిచేసి నెలలు గడవకముందే రాళ్లు తేలడం దారుణం. అనేక మంది ద్విచక్ర వాహనదారులు బోల్తాపడి గాయపడుతున్నారు. వర్షం వస్తే నీరు నిల్వ అవుతుండడంతో ప్రయాణాలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా రైల్వేశాఖాధికారులు అండర్ టన్నల్ వే వద్ద నిర్వహణ చర్యలు తీసుకోవాలి.

– పి.రామేష్, ఆమదాలవలస


నిర్వహణ లేకపోవడంతో అండర్ టన్నల్ వద్ద అధ్వానంగా రహదారి

అపార్ట్‌మెంట్ నిర్మాణంపై జేసీకి ఫిర్యాదు


జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు సమస్య వివరిస్తున్న నాయకులు

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లో కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణ పనులు గురించి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ దృష్టికి పంచాయతీ సర్పంచ్ బి.శంకర్, వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, బీఎల్ శర్మ, ఆర్.శ్రీధర్‌లు తీసుకెళ్లారు. శనివారం జేసీ నరసన్నపేట పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులకు అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా పనులు జరుగుతున్నాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయనకు తెలియజేశారు. సుడా షార్ట్‌ఫాల్‌లో పెట్టి స్టాప్ వర్క్ ఆర్డర్ ఇచ్చిందని వివరించారు. దీనికి జేసీ స్పందించి వెంటనే సుడా అధికారులకు తన మొబైల్ నుంచి మెసేజ్ చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. మరోపక్క సుడా ఇచ్చిన స్టాప్ ఆర్డర్ ప్రకారం పనులు నిలిపివేయాల్సింది పంచాయతీ ఈవోనే అని సుడా అధికారులు అంటున్నారు. ఈ మేరకు ప్రత్యేక జీవో ఉందని చెబుతున్నారు. అలాగే మరో వార్డు సభ్యుడు బోయిన సతీష్, స్థానిక నాయకులు తాలాభక్తుల గోవిందరావు, రామకృష్ణలు హోల్డ్‌లో ఉన్న బొరిగివలస రెవెన్యూ పరిధిలోని 18/1 సర్వే నంబర్‌ను సరిచేయాలని కోరారు. దీనివలన నరసన్నపేటలో 13 వీధులకు చెందిన ప్రజలు క్రయవిక్రయాలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే స్థానిక లెపర్సీ కాలనీలో మంచినీటి సమస్య ఉందని భాగ్యం, లక్ష్మిలు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఈవోకు ఆదేశించారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇషాన్ బాషా


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్‌ఈ, ఈఈ, డీఈలు

నరసన్నపేట: జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇషాన్ బాషా తెలిపారు. శనివారం నరసన్నపేట వచ్చిన ఆయన స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయంలో నరసన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాజాగా జిల్లాలో రూ.813 కోట్లు విలువైన 1,793 పనులను ప్రభుత్వం రెన్యూవల్ చేసిందన్నారు. రెన్యూవల్ పనుల్లో 1,546 పనులకు టెండర్లు పిలిచామని, వీటిలో 800 పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి టెండర్లు వేశారని వివరించారు. మరో 746 పనులకు టెండర్లు రావాల్సి ఉందన్నారు. వీటికి కూడా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తే జిల్లాలో దాదాపుగా జల జీవన్ పథకంతో ఇంటింటికీ తాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 5.34 లక్షల గృహాలు ఉన్నట్లు లెక్కలు ఉన్నాయని, వీటిలో 2.12 లక్షల గృహాలకు కుళాయిలు వేయడం జరిగిందన్నారు. వచ్చే మార్చి నాటికి కనీసం మరో 2 లక్షల గృహాలకు కుళాయిలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

గొట్టా నుంచి నీటి సరఫరాకు ప్రతిపాదనలు

ప్రస్తుతం గొట్టా బ్యారేజీ నుంచి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని, ఇది విజయవంతంగా రన్ అవుతోందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో మిగిలిన ఆరు నియోజకవర్గాలు శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల ప్రజలకు కూడా గొట్టా బ్యారేజీ నుంచి తాగునీటి సరఫరాకు రూ.3,300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీంట్లో మొదటి విడతగా రూ.900 కోట్లతో నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాలకు అనుమతుల రావొచ్చని పేర్కొన్నారు. కాగా నరసన్నపేట మేజర్ పంచాయతీలో ప్రస్తుతం మొదటి ఫేజ్‌లో రూ.5.15 కోట్లతో జల జీవన్ పనులు జరుగుతున్నాయని, రెండో ఫేజ్‌లో మిగిలిన భాగాలకు కుళాయిలు వేయడానికి రూ.9.06 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి నరసన్నపేటలో పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ రంగ ప్రసాద్, డీఈ సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


ఆటోకు సురక్ష క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లు అతికిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. దీనిలో భాగంగా స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆటోలకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్, ఓనర్ వివరాలు, ఆటో ప్రయాణించే దిశ, రోడ్డు మార్గం, లోకేషన్ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు 26 వేల ఆటోలు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రస్తుతం 20 వేల ఆటోలు రవాణాలో ఉన్నాయన్నారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు, మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన ఈ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు డ్రైవర్లు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన శక్తి యాప్‌తో ఈ సురక్ష యాప్‌ను రానున్న రోజుల్లో అనుసంధానం చేస్తామన్నారు. అనంతరం ఈ సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్ రూపకల్పన చేసిన ఐటీ కోర్ ఏఎస్‌ఐ బి.రమేష్, ఉత్తమ ఆటో డ్రైవర్లు భాస్కరరావు, శ్రీనివాసరావులను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విజయ సారధి, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఎంవీ ఐ.గంగాధర్, సీఐలు పైడిపునాయుడు, ఇమ్మనుల్ రాజు, ఈశ్వర్‌రావు, అవతారం, శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి


స్థల పరిశీలన చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

పొందూరు: ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డ పోరంబోకు స్థలాలు ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. మండలంలోని తండ్యాం పంచాయతీ బొట్లపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 5లో వీరమరణం పొందిన సైనికులకు ఇవ్వనున్న స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఆపరేషన్ బ్లూస్టార్‌లో వీరమరణం పొందిన సింగూరు విష్ణుమూర్తి సతీమణి శాంతకు తోలాపిలో 2.5 ఎకరాలు స్థలం కేటాయించారు. అయితే ఆ స్థలంలో చెరువు గర్భం ఉండడంతో దీనిని రద్దు చేశారు. తనకు భూమి కేటాయించాలని సింగూరు శాంత ఉన్నతాధికారులకు వినతి అందించడంతో సెక్రటేరియట్ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో బొట్లపేట సర్వే నంబర్ 5లో స్థల పరిశీలన చేశారు. ఆమెకు పట్టా, పాస్‌బుక్‌లు సిద్ధం చేయాలని తహశీల్దార్ ఆర్.వెంకటేష్‌ను ఆదేశించారు.

ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం తగదు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాశాఖ అధికారులు ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ వెకేషన్ డిపార్ట్‌మెంటనే విషయాన్ని పూర్తిగా మర్చిపోయినట్టుగా ప్రవర్తిస్తున్నారని, వేసవి సెలవుల్లో ఉన్న ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేలా నిర్ణయాలు తీసుకోవడం ఎంత మాత్రం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులంతా సాధారణంగా దూర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్రయాణాల్లో ఉంటారని, దీనికోసం ముందుస్తు రిజర్వేషన్లు చేసుకుంటారన్నారు. అలాంటి వేసవి సెలవుల్లో స్కూల్ గ్రాంట్ల ఆడిట్ తనిఖీ పేరిట వారిని ఇబ్బందులకు గురి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇంత హడావిడిగా సెలవుల్లో తనిఖీ చేయాల్సిన అవసరం ఏముందని సమగ్ర శిక్ష అధికారుల నిర్ణయాన్ని తప్పుపట్టారు. అలాగే మోడల్ స్కూల్, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ మరియు గజిటెడ్ హెడ్ మాస్టర్లలో కొంతమందిని ఈనెల 19వ తేదీ నుంచి 23 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో లీడర్షిప్ ట్రైనింగ్‌కు ఏలూరు పిలవడం కూడా దుర్మార్గపు ఆలోచనగా అభివర్ణించారు. సెలవుల్లో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వాయిదా వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టీచర్లకు అన్యాయం చేయొద్దు


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: బదిలీల్లో ఇన్ సర్వీస్ టీచర్లకు అన్యాయం జరగకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, జిల్లా అధ్యక్షుడు వడమ శరత్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సోరి ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో జిల్లా పరిషత్, మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ప్రభుత్వం కల్పించిన స్టడీ లీవ్ జీవో నంబర్ 342 ప్రకారం ఇన్ సర్వీస్ బీఈడీ చేస్తున్నారని, రెండు నెలల్లో తిరిగి విధుల్లో చేరబోతున్నారని చెప్పారు. కానీ ఇటీవల విద్యాశాఖ చేపడుతున్న బదిలీల్లో వారు పనిచేస్తున్న పాఠశాల పోస్టును క్లియర్ వేకెన్సీగా చూపడం సరికాదన్నారు. వారు పనిచేస్తున్న ప్లేస్‌ను వారికే కేటాయించేలా చూడాలని విన్నవించారు.

పోష్ చట్టాన్ని అమలు చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోష్ చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఇన్‌చార్జి జిల్లా జడ్జి పి.భాస్కరరావు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహారం కోసం 2013లో అమల్లోకి వచ్చిన పోష్ చట్టాన్ని వివరించారు. శారీరక సంబంధాన్ని పురోగతికి షరతుగా పెట్టడం, లైంగిక ప్రయోజనాల కోసం డిమాండ్ చేయడం, అశ్లీల చిత్రాలు చూపించడం, శారీరక లేదా మానసికంగా లైంగిక స్వభావం కలిగిన ప్రవర్తనలు ఇవన్నీ లైంగిక వేధింపులుగా పరిగణించబడతాయని చెప్పారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని పని ప్రదేశాల్లో ఈ చట్టం వర్తిస్తుందని, అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయడం, దర్యాప్తు ప్రక్రియలు పాటించడం తప్పనిసరని వివరించారు. కార్యక్రమంలో 3వ అదనపు జిల్లా జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాకొద్దు బాబోయ్..!


జింకిభద్ర కొత్త చెరువులో తవ్వుతున్న ఫిష్ పాండ్

- ఫిష్‌పాండ్ పనులపై వేతనదారుల నిరాసక్తత
- తక్కువ వేతనం వస్తుందని అసహనం
- పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్

సోంపేట:

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఫిష్ పాండ్ పనులు అంటే వేతనదారులు ఆసక్తి చూపించడం లేదు. జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారుల ఒత్తిడితో గ్రామాల్లో ఫిష్ పాండ్ పనులు చేపడుతుంటే చాలీచాలని వేతనాలు అందుతున్నాయని వాపోతున్నారు. మండలంలోని జింకిభద్ర గ్రామంలో తాము పనులు చేయమని వేతనదారులు శనివారం పనులకు వెళ్లకుండా ఆగిపోయిన ఘటన చోటుచేసుకుంది.

ఇదివరకు మట్టితీసే పనులే...

కేంద్ర ప్రభుత్వం గత వార్షిక సంవత్సరం వరకు చెరువులో మట్టితీసి గట్టుపై వేసే పనులు చేపట్టింది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధుల ఆలోచనలతో చెరువు మధ్యలో మరో చెరువు తవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో చెరువులో నీరు నిల్వ ఉండడంతో పాటు, చేపలు కూడా నిల్వ ఉంటాయని, ఫలితంగా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 5 ఎకరాల పైబడే చెరువుల్లో ఫిష్ పాండ్ తవ్వకాలు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. చెరువు మధ్య భాగంలో సుమారు 40 అడుగుల పొడవు, వెడల్పుతో పాటు 6 అడుగుల లోతు తవ్వాలని వేతనదారులకు సూచించారు. ఈ పని పూర్తి అవ్వడానికి సుమారు రూ.9 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. అయితే ప్రభుత్వ నిబంధనలు వేతనదారులను హడలెత్తిస్తున్నాయి. చెరువులో రెండు అడుగుల లోతు తర్వాత మట్టి తవ్వాలంటే చాలా కష్టమవుతోంది. అందువలన నిబంధనల ప్రకారం పనులు చేపట్టలేకపోతున్నారు. దీంతో వేతనాలు అరకొరగా వస్తున్నాయని చెబుతున్నారు.


వేతనాలు తక్కువగా వస్తున్నాయని ఏపీవోకు తెలియజేస్తున్న వేతనదారులు

సోంపేట మండలంలో...

సోంపేట మండలంలోని సుమారు 15 పంచాయతీల్లో ఫిష్ పాండ్ పనులు మొదలుపెట్టగా అన్నిచోట్ల వేతనదారులు పనులు చేయలేమని చేతులెత్తేశారు. ప్రస్తుతం జింకిభద్ర గ్రామంలో కూడా చేయమని చెప్పేయడంతో ఫిష్ పాండ్ పనులు ఏ పంచాయతీలోనూ పూర్తవ్వని పరిస్థితి నెలకొంది. జింకిభద్ర గ్రామంలో సుమారు 120 మంది వేతనదారులు కొత్త చెరువులో ఫిష్ పాండ్ పనులు చేపడుతున్నారు. మొదటి రెండు వారాలు సరాసరి రూ.200ల వేతనాన్ని అందుకున్నారు. తర్వాత వారం నుంచి వేతనం తక్కువగా వస్తుందని శనివారం పనులకు వెళ్లకుండా నిరసన తెలిపారు. ఫిష్ పాండ్ పనులు చేపడుతుంటే కనీస వేతనం రూ.150లు కూడా అందడం లేదని వాపోతున్నారు. అందుకే ఫిష్‌పాండ్ పనులు చేపట్టకుండా నిరసన తెలియజేస్తున్నామన్నారు. ఇటీవల ప్రభుత్వం కూలీ రేటును రూ.300ల నుంచి రూ.307లకు పెంచింది. కానీ ఎండలో ఫిష్‌పాండ్ పనులు చేస్తుంటే రూ.150లు కూడా రావడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వేతనాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనల మేరకే వేతనం

ప్రభుత్వ నిబంధనలు మేరకు కొలతలు కొలిచి వేతనం వేయడం జరుగుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన మేర పనులు చేపడితే పూర్తిస్థాయిలో వేతనం అందుతుంది. మట్టి గట్టిగా ఉండడంతో వేతనదారులు పనులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ప్రమీల, ఉపాధి ఏపీవో, సోంపేట